స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి

సునార్ గల్లీలో సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ ఉమారమేశ్ యాదవ్

గోల్నాక, ఫిబ్రవరి 25 : స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు కాచిగూడ డివిజన్ కార్పొరేటర్ కన్నె ఉమాయాదవ్ తెలిపారు. ఆదివారం డివిజన్‌లోని మోతిమార్కెట్, అంబాజిగల్లీ, సునార్‌గల్లీ తదితర ప్రాంతాల్లో ఆమె పాదయాత్ర నిర్వహించి స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. అంబాజీ గల్లీలో మంచినీటి సమస్యలను స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకురాగా సంబధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలి

యువకులు క్రీడల్లో రాణించాలని నాంపల్లి ఎమ్మెల్యే మహ్మద్ మాజీద్‌హుస్సేన్ అన్నారు. ఆదివారం మల్లేపల్లి డివిజన్‌లోని యువకులకు క్రీడా సామగ్రిని ఎంఐఎం నాయకుడు జాఫర్‌ఖాన్‌తో కలిసి ఎమ్మెల్యే అందించారు.
– మెహిదీపట్నం ఫిబ్రవరి 25

ఆస్తి పన్ను వసూలుకు చర్యలు వేగవంతం

అధికారుల సమీక్షలో జోనల్ కమిషనర్, డీసీలు



అబిడ్స్, ఫిబ్రవరి 25 : ఆస్తి పన్ను చెల్లింపు గడువు మార్చి 31వ తేదీ దగ్గర పడుతుండటంతో జీహెచ్ఎంసీ సర్కిల్-14 కార్యాలయం అధికారులు పన్ను వసూళ్లను వేగిరం చేశారు. ఇందులో భాగంగా లక్షకు పైగా ఆస్తి పన్ను బకాయి పడిన వారి నుంచి పన్ను వసూలుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. సర్కిల్ పరిధిలో అత్యధికంగా ప్రభుత్వ భవనాలు ఉండగా ఆయా భవనాల ఆస్తి పన్ను వసూలు చేసేందుకు సంబంధిత అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నారు. ఇప్పటికే డిమాండ్ నోటీసులు జారీ చేసి స్పందించని వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తున్నారు. సర్కిల్ పరిధిలోని అన్ని విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బందిని రంగంలోకి దింపి పన్ను వసూలు చేస్తున్నారు. ఉన్నతాధికారులు 90 కోట్ల టార్గెట్ విధించగా ఇప్పటికే యాభై కోట్ల వరకు ఆస్తి పన్ను వసూలు చేశారు.
జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ వెంకటేశ్ ధోత్రే పర్యవేక్షణలో సర్కిల్-14 డిప్యూటీ కమిషనర్ ఎస్ విద్యాధర్ ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్‌లు, బీఎల్ఓలతో సమావేశాలు నిర్వహించి ఆస్తి పన్ను వసూలు టార్గెట్ పూర్తి చేసేందుకు పాటు పడుతున్నారు.

నగరాభివృద్ధికి ఆస్తి పన్ను చెల్లించండి

నగరాభివృద్ధికి ఆస్తి పన్ను బకాయి పడిన వారు అపరాధ రుసుము లేకుండా గడువులోపు చెల్లించాలి. సర్కిల్-14 పరిధిలో ఆస్తి పన్ను బకాయి పడిన వారికి ఇప్పటికే నోటీసులు జారీ చేశాం. సిబ్బందితో సమీక్ష సమావేశాలు నిర్వహించి గడువు లోపు ఆస్తి పన్ను చెల్లింపులు జరిగేలా చూస్తున్నాం.

–ఎస్ విద్యాధర్, జీహెచ్ ఎంసీ డిప్యూటీ కమిషనర్

కేటీఆర్ సమావేశాన్ని విజయవంతం చేయాలి

బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్ బి. పద్మావెంకట్‌రెడ్డి



బాగ్‌అంబర్‌పేట బీఆర్ఎస్ సన్నాహక సమావేశంలో పాల్గొని మాట్లాడుతున్న కార్పొరేటర్ బి. పద్మావెంకట్‌రెడ్డి

గోల్నాక, ఫిబ్రవరి 25 : 27న నిర్వహించనున్న అంబర్‌పేట నియోజకవర్గం బీఆర్ఎస్ సమావేశాన్ని విజయవంతం చేయాలని బాగ్‌అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ బి.పద్మావెంకట్ రెడ్డి పిలుపు నిచ్చారు. ఆదివారం డివిజన్‌లోని శ్రీనివాస్‌నగర్ కమ్యూనిటీహాల్‌లో బీఆర్ఎస్ ముఖ్య నాయకుల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఈ నెల 27న మహారాణా ప్రతాప్‌హాల్‌లో ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న సమావేశానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ హాజరవుతున్నట్లు తెలిపారు. అలాగే రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిని అధిక మెజార్టీతో గెలిపించాలని ఆమె కోరారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు గెల్వయ్య, మోర శ్రీరాములు ముదిరాజ్, మహేందర్‌రెడ్డి, చంద్రమోహన్, కనివేటి నర్సింగ్‌రావు, మిరియాల రవీందర్, సంజీవ్ చౌదిరి, జె. బాల్‌రాజ్, కోట్ల సంతోష్, రమేశ్‌నాయక్, శ్రీహరి, మిరియాల శ్రీనివాస్, రమేశ్, వెంకటరమణ, మహేశ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సుదర్శన హోమం

రాంనగర్ ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య ఫామిలీ వెల్ఫేర్ అసోసియేషన్‌ల ఆధ్వర్యంలో ఆదివారం జెమిని కాలనీ శివాలయంలో సుదర్శన హోమం, మహా మత్యుంజయ హోమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ నేత పూస రాజు, సంఘం ప్రతినిధులు వి. సుధాకర్‌గుప్త, ఎర్రం శ్రీనివాస్, నేతి సత్యనారాయణ, రాజశేఖర్‌గుప్త, చల్ల శివకుమార్, సత్యవర్ధన్, పులిగిల్ల కృష్ణమూర్తి, గంప మల్లేశ్, రమేశ్‌రామ్, రామనాథం, రఘురాములు, చంద్రశేఖర్, చామల శ్రీనివాస్, ఎర్రం రమేశ్, నాగేందర్, ప్రకాశ్ రంగారావు తదితరులు పాల్గొన్నారు.
– ముషీరాబాద్, ఫిబ్రవరి 25

మసీదుల అభివృద్ధికి చర్యలు తీసుకోండి

మైనార్టీ సంక్షేమ శాఖ కమిషనర్ ఒమర్ జలీల్‌తో మాట్లాడుతున్న కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మొహినుద్దీన్

మెహిదీపట్నం ఫిబ్రవరి 25 :మసీదుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహినుద్దీన్ అన్నారు. ఈ మేరకు మైనార్టీ సంక్షేమ శాఖ కమిషనర్ ఒమర్ జలీల్‌ను ఎమ్మెల్యే కలిసి మసీదుల అభివృద్ధిపై చర్చించారు. ఇమామ్‌పురా, లంగర్‌హౌస్, పురానాపూల్ ప్రాంతాలలో మసీదుల అభివృద్ధికి నిధులను కేటాయించి పనులను చేపట్టాలని ఎమ్మెల్యే కౌసర్‌మొహినుద్దీన్ అన్నారు. దీనికి స్పందించిన కమిషనర్ ఒమర్ జలీల్ సంబంధిత అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

విద్యార్థుల భారత్ బచావో సదస్సు

సదస్సులో పాల్గొన్న అధ్యాపకులు, వామపక్షాల నేతలు

ముషీరాబాద్, ఫిబ్రవరి 25: దేశంలో విద్యా పరిరక్షణ కోసం విద్యార్థులు, యువత రైతు ఉద్యమ స్ఫూర్తితో ముందుకుసాగాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన భారత్ బచావో విద్యార్థుల సదస్సులో పలువురు వక్తలు పాల్గొని ప్రసంగించారు. సదస్సులో ప్రారంభోపాన్యాసం చేసిన ప్రొఫెసర్ అనితారాంపాల్ మాట్లాడారు. సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ మాట్లాడుతూ.. ప్రజల హక్కులకు బాధ్యత వహించాల్సిన ప్రభుత్వాలు హక్కులను కాలరాసే చర్యలకు పాల్పడుతున్నాయని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో సీపీఐఎంఎల్ న్యూడెమొక్రసీ నేతలు కె. గోవర్ధన్, ఝాన్సీ, ప్రొఫెసర్ అన్వర్‌ఖాన్, కొల్సీ పాటిల్, నేతలు గాదె ఇన్నయ్య, గోపీనాథ్, రమేశ్ బాబు పాల్గొన్నారు.

రైతు చట్టాలను వ్యతిరేకించాలి

రవీంద్రభారతి,ఫిబ్రవరి 25 : ఇచ్చిన హామీలను నెరవేర్చాలని రైతులు డిమాండ్ చేస్తూ ఉద్యమాలు చేస్తుంటే నరంద్ర మోదీ ప్రభుత్వం కాల్చిచంపుతుందని కార్మికులు, రైతులు ఖండించాలని ఇంక్లాబ్ సేన ప్రతినిధులు చెప్పారు. ఆదివారం బషీర్‌బాగ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఇంక్లాబ్ సేనా రాష్ట్ర అధ్యక్షుడు మహమ్మద్ జానీ ఉమర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఎం హుస్సేన్ మాట్లాడారు.

కాంగ్రెస్‌లో చేరిన డిప్యూటీ మేయర్ దంపతులు

హైదరాబాద్, ఫిబ్రవరి 25 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి దంపతులు గాంధీభవన్‌లో ఆదివారం ఉదయం ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాసు మున్షీ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. శ్రీలతరెడ్డికి కాంగ్రెస్ కండువా కప్పి దీపాదాసు మున్షీ పార్టీలోకి ఆహ్వానించారు. శ్రీలతా రెడ్డి దంపతులు ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన విషయం తెలిసిందే.

ఉచిత వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

దోమలగూడలోని కిడ్‌హుడ్ ప్రీస్కూల్‌లో మెగా మెడికల్ క్యాంప్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ రచనశ్రీ

కవాడిగూడ, ఫిబ్రవరి 25: ఉచిత వైద్య శిబిరాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని కవాడిగూడ డివిజన్ కార్పొరేటర్ గోడ్చల రచనశ్రీ అన్నారు. ఈ మేరకు ఆదివారం కవాడిగూడ డివిజన్ దోమలగూడలోని కిడ్‌హుడ్ ప్రీస్కూల్‌లో బద్రివిశాల్ పన్నాలాల్ పిత్తి ట్రస్ట్ అగర్వాల్ సమాజ్ తెలంగాణ శాఖ, అగర్వాల్ సమాజ్ హెల్త్ క్లినిక్ ఆధ్వర్యంలో శ్రీ భగవాన్ మహావీర్ విక్లాంగ్ సహాయత సమితి, హైదరాబాద్, మెడికవర్ దవాఖాన బేగంపేట, ఎల్‌సీఎస్ దండు ఐ ఇన్‌స్టిట్యూట్ వెస్ట్ మారెడ్‌పల్లి సహకారంతో ఏర్పాటు చేసిన మెగా మెడికల్ క్యాంప్‌ను ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం వరకు జరిగిన ఈ క్యాంప్‌లో కంటి పరీక్షలు, జనరల్ ఫిజీషియన్, డెంటల్, ఫిజియోథెరపీ, బీపీ, ఆర్థో, శుగర్ తదితర పరీక్షలను నిర్వహించి మందులు పంపిణీ చేశారు.
ఈ కార్యక్రమంలో ప్రదీప్ అగర్వాల్, సుధీర్‌గుప్తా, సురేందర్‌గోయల్, విజయ్ కుంచల, రష్మి అగర్వాల్, బీజేపీ రాష్ట్ర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ ఉద్యమకారులకు టికెట్లు కేటాయించాలి

మాట్లాడుతున్న రంగయ్య

కవాడిగూడ, ఫిబ్రవరి 25: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో పర్యావరణ ఉద్యమకారులకు టికెట్లు కేటాయించాలని ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షుడు సీహెచ్ రంగయ్య వివిధ రాజకీయ పార్టీలకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ అంటే సామాజిక సుస్థిరత అని, తాము పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉన్నామనే పార్టీలు ఈ ఎన్నికల్లో ఆయా రాష్ట్రాల్లో కనీసం ఒక సీటు అయినా పర్యావరణ ఉద్యమకారులకు కేటాయించాలని అన్నారు.

అనంతరామన్ కమిషన్ ఏర్పాటుకు మల్లయ్య కృషి మరువలేనిది

తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు

బీసీ సాధికారత భవన్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న వకుళాభరణం కృష్ణమోహన్‌రావు

సుల్తాన్‌బజార్, ఫిబ్రవరి 25 : రాష్ట్రంలో బీసీ కులాల హక్కుల కోసం గౌతు లచ్చన్న, కొండా లక్ష్మణ్‌బాపూజీల అడుగుజాడల్లో మత్స్యకారుల భీష్ముడు ఏఎల్ మల్లయ్య చేసిన సేవలు చిరస్మరణీయమని తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు అన్నారు. ఈ మేరకు ఆదివారం హనుమాన్‌టెక్డీలోని బీసీ సాధికారత భవన్‌లో మల్లయ్య తొలి వర్ధంతి సభను నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ.. ఏఎల్ మల్లయ్య తెలుగు రాష్ట్రాల మత్స్యకారుల మహా నాయకుడని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ కాంగ్రెస్ మెట్టు సాయిప్రసాద్, బీసీ(ఎ)కుల రిజర్వేషన్ల హక్కుల పరిరక్షణ కమిటీ చైర్మన్ ప్రొఫెసర్ బాలయ్య, ప్రొఫెసర్ సుదర్శన్, డాక్టర్ బొమ్మెరబోయిన లక్ష్మయ్య, గంగపుత్ర సంఘం అధ్యక్షుడు గడప శ్రీహరి, ఉపాధ్యక్షులు శివరత్నం, భగవాన్, ఏఎల్ మల్లయ్య కుమారుడు అంబటి సత్యనారాయణ, అంబటి శ్రీనివాస్,అంబటి సుధాకర్,అంబటి సంతోష్, మల్లేశ్, గంగపుత్ర సంఘం మహిళా నాయకులు సంగీత, స్వర్ణలత, మాధవీలత, భారతి తదితరులు పాల్గొన్నారు.

దళితులకు రిజర్వేషన్లు పెంచాలి

ధర్నాచౌక్‌లో దీక్ష చేపడుతున్న తెలంగాణ దళిత రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు గంధం సుమన్

కవాడిగూడ, ఫిబ్రవరి 25: దళితులకు రిజర్వేషన్లను 18 శాతానికి పెంచాలని తెలంగాణ దళిత రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర వ్యస్థాపక అధ్యక్షుడు గంధం సుమన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ వ్యాప్తంగా 59 ఉప కులాలలు దళిత ప్రజలు పెరిగిన జనాభాకు అనుగుణంగా 18 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు బండి అజయ్‌మాదిగ, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జి. శ్రీకాంత్ మాదిగ, డబ్బా రాజు తదితరులు పాల్గొన్నారు.

హోమియోపతి ప్రాధాన్యతపై ప్రసంగం

హోమియోపతిక్ మెడికల్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ సమావేశంలో పాల్గొన్న డాక్టర్ జి.దుర్గాప్రసాద్ తదితరులు

అబిడ్స్, ఫిబ్రవరి 25 : హోమియోపతిక్ మెడికల్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో స్మారక ప్రసంగాలను నిర్వహించారు. జూపల్లి బాలమ్మ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమానికి అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ కె. గోపాలకృష్ణ అధ్యక్షత వహించగా ప్రధాన కార్యదర్శి డాక్టర్ జి.దుర్గాప్రసాద్‌రావు పాల్గొని ప్రసంగిస్తూ డాక్టర్ సీఎల్ మోదీ చారిటబుల్ హోమియోపతిక్ డిస్పెన్సరీ, స్పెషాలిటీ క్లీనిక్‌ల సేవలతో పాటు అసోసియేషన్ కార్యకలాపాలను వివరించారు. పీడియాట్రిక్ కేసులు హోమియోపతిలో ప్రాధాన్యత అంశంపై డీఈవీ హోమియోపతిక్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ టి. మురళి స్మారక ప్రసంగం చేశారు. అనంతరం హోమియోపతిలో అటిజం చికిత్సపై పాజిటివ్ హోమియోపతి హెల్త్ సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకులు డాక్టర్ కేర్ హోమియోపతి డైరెక్టర్ డాక్టర్ ఎఎం రెడ్డి, కో-కన్వీనర్ డాక్టర్ వేణుగోపాల్ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ హోమియోపతి వైద్యులు పాల్గొన్నారు.

చిన్నారెడ్డికి శుభాకాంక్షలు

తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక వైస్ చైర్మన్‌గా నియమితులైన మాజీ మంత్రి జి. చిన్నారెడ్డికి టీపీసీసీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. గాంధీభవన్‌లో చిన్నారెడ్డిని టీపీసీసీ ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి పొల్కం శ్రీనివాస్, పాశం రాజేందర్‌యాదవ్, నర్సింగ్‌రావు, పొల్కం వినయ్‌రాజ్ తదితరులు కలిసి అభినందనలు తెలిపారు.
– అబిడ్స్, ఫిబ్రవరి 25

హిందువులంతా ఏకం కావాలి

కార్వాన్ శిశుమందిర్‌లో హిందూ జన జాగరణ వేదిక కార్యక్రమంలో పాల్గొన్న ఆర్ఎస్ఎస్ విభాగ్ ప్రచారక్ రామ సుబ్రహ్మణ్యంజీ, లతా మా ఫౌండేషన్ చైర్మన్ మాధవీలత, నర్సింగ్‌దాస్, ప్రతాప్ తదితరులు, పాల్గొన్న ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు

కార్వాన్, ఫిబ్రవరి 25 : హిందూ జన జాగరణ వేదిక ఆధ్వర్యంలో కార్వాన్ శిశుమందిర్‌లో ఆదివారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఆర్ఎస్ఎస్ విభాగ్ ప్రచారక్ రామ సుబ్రహ్మణ్యం, లతా మా ఫౌండేషన్ చైర్మన్ మాధవీలత, యూనివర్సిటీ కాలేజీ ఆఫ్ సైన్స్ రిటైర్డ్ వైస్ ప్రిన్సిపాల్ నర్సింగ్‌దాస్, ఉస్మానియా యూనివర్సిటీ డిప్యూటీ రిజిస్ట్రార్ ప్రతాప్ పాల్గొని ప్రసంగించారు. హైందవ సమాజంపై దాడులు జరగడాన్ని వారు ఖండించారు. హిందువులపై దాడులు జరగకుండా ఉండేందుకు హిందువులంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు. అంతే కాకుండా యువత పాశ్చాత్య పోకడలను మానుకోవాలని, సంస్కృతి, సంప్రదాయాలకు విలువ ఇవ్వాలని సూచించారు. దేశంలో లవ్ జిహాదీలు పెరిగి పోతున్నారని, వారి బారిన పడకుండా యువత జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. మత మార్పిడులు జరగకుండా అంతా పాటు పడాలని కోరారు. ప్రపంచంలో హైందవ మతానికి ఎంతో ప్రాముఖ్యత ఉందని, విదేశీయులు హిందూ సంస్కృతిని పాటించేందుకు ముందుకు వస్తుంటే మన వాళ్లు మాత్రం పాశ్చాత్య సంస్కృతికి అలవాటు పడడం బాధాకరమన్నారు. భారత సంస్కృతి, సంప్రదాయాలను ఇతర దేశాలు పాటిస్తున్నాయంటే వాటికి ఎంత ప్రాముఖ్యత ఉందో గుర్తించాలని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు ముళ్లె రాకేశ్, అనంతకృష్ణ, రక్షిత్, కార్తీక్, నరేందర్ మహాజన్, విజయ్, మనీశ్, శ్రీకాంత్‌సాగర్, రాధాకృష్ణ, ప్రభాకర్, డి. శ్రీనివాస్, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని మహిళ మృతి

కాచిగూడ, ఫిబ్రవరి 25: రైలు ఢీ కొని ఓ మహిళ మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం తెల్లవారు జామున జామైఉస్మానియా, విద్యానగర్ రైల్వే స్టేషన్ల మధ్య పట్టాలు దాటుతుండగా అదే సమయంలో వచ్చిన రైలు ఢీ కొనడంతో గుర్తు తెలియని మహిళ(50) మృతి చెందింది. కేసు నమోదు చేఁకొని రైల్వే పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్ర గణిత ఫోరం అధ్యక్షుడిగా శ్రీనివాస్

అబిడ్స్, ఫిబ్రవరి 25 : రాష్ట్ర గణిత ఫోరం అధ్యక్షుడుగా కందికొండ శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఫోరం ప్రతినిధులు ఆయన అభినందనలు తెలిపారు. 33 జిల్లాల టీఎంఎఫ్ కమిటీ సమావేశంలో జరిగిన ఎన్నికలలో కందికొండ శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడంతో తెలంగాణ రాష్ట్ర అవోపా అధ్యక్షుడు మలిపెద్ది శంకర్, ప్రధాన కార్యదర్శి పొల శ్రీధర్, అదనపు ప్రధాన కార్యదర్శి సిరిపురం శ్రీనివాస్ అభినందనలు తెలిపారు.

ఇంటి నిర్మాణానికి సాయం చేస్తా

అబిడ్స్, ఫిబ్రవరి 25: చింతల్‌బస్తీ నాలాలో ఇళ్లు కూలిపోవడంతో నాంపల్లి ఎమ్మెల్యే మహ్మద్ మాజిద్ హుస్సేన్ సంఘటనా స్థలాన్ని సందర్శించి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఇళ్లు కూలిన ఘటనలో ఏడుగురు కుటుంబ సభ్యులు తృటిలో తప్పించుకున్నారని తెలిపారు. వారి ఇంటిని నిర్మాణం చేసుకునేందుకు ఆర్థిక సహాయం అందజేస్తానని కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

గ్రహణ మొర్రి చిన్నారులకు డ్రీమ్ అన్‌లిమిటెడ్ కార్యక్రమం

డ్రీమ్స్ అన్‌లిమిటెడ్ కార్యక్రమంలో ప్రతిభ కనబర్చిన చిన్నారులతో నిర్వాహకులు

బంజారాహిల్స్,ఫిబ్రవరి 25: గ్రహణ మొర్రి సమస్యలతో బాధపడే చిన్నారుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచేందుకు బసవతారకం స్మైల్ ట్రైన్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం 'డ్రీమ్స్ అన్‌లిమిటెడ్' పేరుతో థియేటర్ వర్క్‌షాపు నిర్వహించారు. ఆదివారం బంజారాహిల్స్‌లోని బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చిన్నారుల్లో దాగిన ప్రతిభను వెలికి తీసేలా నాటికలు ప్రదర్శించారు. సరైన రీతిలో మాట్లాడటం, బాడీ లాంగ్వేజ్‌ను మెరుగుపర్చుకోవడం, వ్యక్తిత్వ వికాసం తదితర అంశాలపై నాలుగురోజుల పాటు శిక్షణ అందించామని స్మైల్ ట్రైన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డా.డి.ముకుంద్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో అభిజిత్ కొంపి, మమత కరోల్, అర్చనా సురేశ్, డా.కేవీఎన్.రాజు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE I JUNIOR CIVIL JUDGE ::CITY CIVIL COURTS :: AT : SECUNDERABAD
OS NO. 751 / 2020
Between:
State Bank of India
Retail Assets Central Processing Centre, SARC Wing, Patny Centre, Secunderabad, Rep. by its Manager ... Plaintiff
AND
Mr.Macha Mallikarjun and another ... Defendants
To
1. Mr.Macha Mallikarjun S/o M. Mysaiah, R/o Sy. no. 74 & 75, Silver Green, Villa No.10, Shramika Shakthi Nagar, Cherlapally, Hyderabad -83. And also at: H.No. 2-2-3/3/10/A, Sai Surabhi Apts, Beside Airtel Office, DD Colony, Hyderabad.
2. Mr. Kunuru Buchaiah Goud, H.No.2-2-3/3/10/A, Sai Surabhi Apts, Beside Airtel Office, DD Colony, Hyderabad.
Take notice that the above named plaintiff instituted the suit against both of you for recovery of **Rs. 5,30,051-00Ps.** You are hereby summoned to appear in this court in person or by pleader duly instructed and able to answer all material questions on **04-04-2024** at 10.30 AM. Take notice that in default of your appearance the suit will be heard and decided in your absence.
// By Order of the Court //
Ms. D.K Lakshmi Kumari,
Manikanta Paradise Apartment, Dwarakanagar, Phase-II, Uppal, Hyderabad, Pin Code - 500039
Counsel For Plaintiff